
క్లుప్తంగా

వైభవంగా చండీయాగం



చండీహోమం నిర్వహిస్తున్న అర్చకుడు

ఒంగోలు టౌన్: నగరంలోని మిలటరీకాలనీ యానాది సంగంలో వెలసిన పోలేరమ్మ, కనక దుర్గమ్మ దేవస్థానంలో ఆదివారం అత్యంత వైభవంగా చండీయాగం నిర్వహించారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని అర్చకస్వాములు సుధీర్‌కుమార్, రాముశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, కలశపూజ, దీక్షా హోమం, పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. అనంతరం మంగళహారతులతో భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. ఈ యాగంలో వేదపురోహితులు దండిభట్ల శ్రీనివాసశాస్త్రి, ఆలయ నిర్వాహకులు నాగూర్‌వలి పాల్గొన్నారు.

ఆటోమొబైల్ డీలర్స్ అధ్యక్షునిగా చంద్రశేఖరరావు

ఒంగోలు: ఒంగోలు ఆటోమొబైల్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా ముప్పా చంద్రశేఖరరావు ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక సూర్య కాంప్లెక్స్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సభ్యులందరూ ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ముప్పా చంద్రశేఖరరావు, ప్రధాన కార్యదర్శిగా వై.సురేష్‌రెడ్డి, కోశాధికారిగా ఎస్.పాపారావును ఎన్నుకున్నారు.

ముగిసిన సువార్త సభలు



మాట్లాడుతున్న రెవరెండ్ ప్రశాంత్‌జోషి

ఒంగోలు రూరల్: మూడు రోజులుగా మండలంలోని కరవది క్రిస్టియన్‌పేటలో బేతేల్ మినిస్ట్రీస్ వారు నిర్వహిస్తున్న సువార్త మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ప్రారంభ ఉపన్యాసాన్ని కుమారి జి.బేబిస్టార్ చేయగా, బెంగళూరు నుంచి వచ్చిన దైవ వర్తమానికుడు రెవ.ప్రశాంత్‌జోషి ముఖ్య ప్రసంగికులుగా పాల్గొన్నారు. చివరిరోజు ప్రార్థనా సభలను పాస్టర్ సీహెచ్ విక్టర్‌పాల్ నిర్వహించారు. ప్రశాంత్‌జోషి మాట్లాడుతూ విశ్వాసం వలన లోకంలో మనం జయజీవితాన్ని పొందగలమన్నారు. బేతేల్ మినిస్ట్రీస్ వారు సుమధుర సంగీతాన్ని అందించగా, బెంగళూరు నుంచి వచ్చిన గాయకులతో కలిసి ఆలపించారు. ప్రార్థనా మందిర ప్రతిష్టాపన సందర్భంగా ఈ నెల 16, 17, 18 తేదీల్లో వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడి

నాగులుప్పలపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసి వారి నుంచి రూ.8,450 నగదుతో పాటు 26 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. టీ.అగ్రహారం గ్రామంలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.1,200, మట్టిగుంట గ్రామంలో 20 మందిని అదుపులోకి తీసుకుని రూ.7,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

దేవస్థానం అభివృద్ధికి సహకరిస్తా

మార్కాపురం: రాచర్ల మండలం జేపీ చెరువు సమీపంలోని నెమల్లిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం నూతన ఈఓగా బాధ్యతలు చేపట్టిన రమేష్ ఆదివారం మార్కాపురంలోని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఈఓకు సూచించిన ఎమ్మెల్యే.. తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కె.ఓబులేసు ఉన్నారు.

పీడీ శ్యామలకు ఎమ్మెల్యే అభినందన



ఎమ్మెల్యే కేపీకి పతకాలు చూపిస్తున్న పీడీ

మార్కాపురం: దక్షిణ కోరియాలో గత నెలలో నిర్వహించిన ఆసియా పసిఫిక్ మాస్టర్ గేమ్స్‌లో హర్డిల్స్, పరుగు పందెం పోటీల్లో భారత్ తరఫున పాల్గొని పతకాలు సాధించిన బాలికోన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డోలా శ్యామలాదేవిని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అభినందించారు. ఆదివారం ఆమె ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు దక్కిన పతకాలను ఎమ్మెల్యేకు చూపించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



అగ్రహారంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

● సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: రిటైర్డ్ తహసీల్దార్ నూతలపాటి నాగేశ్వరరావు సంతనూతలపాడులో ఆయన తల్లిదండ్రుల పేరు మీద చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. తన తల్లిదండ్రులు నూతలపాటి లక్ష్మయ్య, సుబ్బాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ పేరుమీద 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకుంటున్న విద్యార్థులకు వేసవి సెలవుల్లో 30 రోజుల పాటు కంప్యూటర్ కోర్సులో ఎంఎస్ ఆఫీస్, నెట్ వర్కింగ్‌పై నాగేశ్వరరావు శిక్షణ ఇప్పించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు టీజేఆర్, బూచేపల్లి చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేయించారు. ఈ సందర్భంగా సుధాకర్‌బాబు, శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ నాగేశ్వరరావు వేసవి సెలవుల్లో విద్యార్థులకు కంప్యూటర్‌లో శిక్షణ ఇప్పించడం వలన వారి భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతుందని అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిని నాగేశ్వరరావు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, సర్పంచ్ దర్శి నాగమణి, దుంపా యలమందారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొలుపుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: మండలంలోని అగ్రహారం గ్రామంలో ఆదివారం నిర్వహించిన దేవర కొలుపుల్లో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొని పూజలు చేశారు. అమ్మవారి ఆశీర్వాదాలు స్వీకరించారు. కొలుపుల సందర్భంగా స్థానిక భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

తీరప్రాంతంలో పర్యావరణాన్ని కాపాడాలి

కొత్తపట్నం: తీరప్రాంతంలో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కళాజాత ప్రతినిధి కనుమూరి నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ స్టూడెంట్ అవేర్నెస్ ఆర్గనైజేషన్ కళాజాత ఆధ్వర్యంలో ఆదివారం మత్స్యకారులకు అవగాహన కళాజాత నిర్వహించారు. తీరం వెంట కళాజాత బృందం ప్లాస్టిక్ నిషేధానికి పరిష్కారాలు, అనర్థాలు, మనుషులకు వచ్చే వ్యాధులు, సకల జీవరాసులకు కలిగే అనర్థాల గురించి పాటల రూపంలో వివరించారు. తీరంలో వివిధ రకాల కోళ్లబరాలు, దుర్వాసన, తీరంలో వేసే ప్లాస్టిక్ సంచుల వల్ల వచ్చే కాలుష్యం, మత్స్య సంపద ఎలా చనిపోతుందో పాటల రూపంలో వివరించారు. కళాజాత పాటలు మత్స్యకారులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాకారుడు కర్రి నాగరాజు, మత్స్యకారులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత



క్రికెట్ విజేతలకు బహుమతులిస్తున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: కారుమంచి అశోక్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి చేతుల మీదుగా ఆదివారం సంతనూతలపాడులో బహుమతులు అందజేశారు. సంతనూతలపాడు అంబేడ్కర్ యూత్ ఫోర్స్ పర్యవేక్షణలో గత నెల 24 నుంచి ఆదివారం వరకు నిర్వహించిన ఈ పోటీలలో 50 జట్లు వరకు పాల్గొన్నాయి. వాటిలో మొదటి బహుమతిని సంతనూతలపాడు రైజింగ్ స్టార్ గెలుచుకుంది. ద్వితీయ బహుమతిని అంబేడ్కర్ క్లబ్, మూడో బహుమతిని ఒంగోలు కొల్లాస్ జట్టు గెలుచుకుంది. మొదటి బహుమతిగా రూ.18,116ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ద్వితీయ బహుమతిగా రూ.12,116ని సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, తృతీయ బహుమతిగా రూ.7,116ను కారుమంచి రమణయ్య స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దుంపా రమణమ్మ, దుంపా యలమందారెడ్డి, ఎంఎస్ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ డీవీ రమణారెడ్డి, గోపీకృష్ణారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమలనాథస్వామి కల్యాణం



రాజంపల్లి (పెద్దారవీడు): గొంద్రాలికొండ తిరుమలనాథస్వామి



తాళ్లూరు: ముస్తాబైన గుంటి గంగ అమ్మవారు



బేస్తవారిపేట: ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

రాజంపల్లి (పెద్దారవీడు): వేదపండితుల మంత్రోచ్చరణలు, ముత్యాల తలంబ్రాలు, సుమంగళ వాయిద్యాల నడుమ శ్రీదేవి భూదేవి సమేత శ్రీగొంద్రాలికొండ తిరుమలనాథస్వామి కల్యాణం ఆదివారం తెల్లవారు జామున వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలకు పట్టువస్త్రాలు, పసిడి, రజిత ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయ దేవేరులతో కలిసి స్వామి వారు భక్తులకు నయనానందకరంగా దర్శనమిచ్చారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకించారు. ముత్యాల తలంబ్రాలు, తీర్థప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. ఉభయదాతలు గోపాలుని ప్రదీప్, శ్రీహర్ష, నాగరాజు, మల్లికార్జునరావు, తిరుమలరావు, శ్రీనివాసరావు, రమేష్‌బాబు, గ్రంథే వెంకటేశ్వర్లు, రాము, వెంకటేశ్వర్లు, మల్లికార్జున దంపతులు వ్యవహరించారు. స్వామి వారిని సింహ వాహనంపై మేళతాళాలతో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. భక్తులకు అల్పాహారం కటిక శివరాం, ఉయ్యూరు సాంబిరెడ్డి దంపతులు ఏర్పాటు చేశారు.

గుంటి గంగ అమ్మవారికి విశేష పూజలు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు తొమ్మిది చీరలు బహూకరించారు. ఆలయానికి రూ.15,454 ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. సౌకర్యాలను ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈట భాస్కర్‌రెడ్డి, ఆలయాధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండ హారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

మార్కాపురంలో..

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

కార్మికుల ఉపాధిని కాపాడండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు

చీమకుర్తి: గ్రానైట్ పరిశ్రమను నిలబెట్టి కార్మికుల ఉపాధిని కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు షేక్ మాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం మండల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ కరోనా కాలం నుంచి గ్రానైట్ పరిశ్రమ కష్టాలు ఎదుర్కొంటోందని, చైనా నుంచి బయ్యర్లు రాక గ్రానైట్ ఎగుమతులు దాదాపు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాని ప్రభావం గ్రానైట్ కార్మికులపై పడి వారి ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రానైట్ పరిశ్రమ నిలదొక్కుకోవడానికి రాయితీలను ప్రకటించి ఎగుమతులను ప్రోత్సహించే విధంగా విదేశీ విధానాలను మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, స్థానికులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత.. ట్రోఫీఫైటర్



క్రికెట్ విజేతలకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ వీరరాఘవరావు

కొత్తపట్నం: చెరుకూరి ఉషారాణి ద్వితీయ వర్ధంతి సందర్భంగా మండల వైఎస్సార్ సీపీ, కొత్తపట్నం క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. నూతనంగా ప్రారంభించిన వైఎస్సార్ ప్రాంగణంలో మే 19న ప్రారంభమైన ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఎంతో ఆసక్తిగా సాగింది. ముగింపు సందర్భంగా ఉషారాణి ఆత్మకు శాంతి చేకూరాలని క్రీడాకారులు నిమిషంపాటు మౌనం పాటించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా రూ.25,116, కప్‌ను ట్రోఫీఫైటర్ జట్టుకు అందించారు. రెండో బహుమతిగా రూ.15,116ను కొత్తపట్నం క్రికెట్ క్లబ్ జట్టుకు, మూడో బహుమతిగా రూ.10,116ను ఇంజినీరింగ్ బ్యాడ్మింటన్ షటిల్ కోర్టు జట్టుకు, నాలుగో బహుమతిగా రూ.5,116ను జడ లెవన్స్ బ్యాడ్మింటన్, ఒంగోలు జట్టుకు, ఐదో బహుమతిగా రూ.3,116ను రెడ్డి యూత్ జట్టుకు అందజేశారు. బహుమతులన్నీ చెరుకూరి ఉషారాణి భర్త డాక్టర్ చెరుకూరి వీరరాఘవరావు సొంత నగదుతో అందించారు. రాఘవరావును క్రీడాకారులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ వైఎస్సార్ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు రూ.6 లక్షలు ఖర్చయిందన్నారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి రూ.2 లక్షలు, క్రికెట్ జట్టు సభ్యులు రూ.4 లక్షలు అందజేశారన్నారు. గ్రౌండ్ అంతా చిల్లచెట్లతో ఉందని, బాగు చేశామని తెలిపారు. గ్రౌండ్‌ను ఉపయోగించుకుంటే పిచ్చి మొక్కలు రాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కట్టా శేఖర్, తంబి సురేష్, అయిబాబు, క్రికెట్ జట్టు సభ్యులు పురిణి మహేష్, బాలాజీ పాల్గొన్నారు.

భావితరాల కోసం పాటుపడాలి



ఉప్పుగుండూరులో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న జనశిక్షణ సంస్థ సభ్యులు

నాగులుప్పలపాడు: భావితరాల అభ్యున్నతి కోసం, దేశ ప్రజల సంతోషం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని జనశిక్షణ సంస్థ సభ్యుడు తెలగతోటి శ్యామ్యూల్ అన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఔత్సాహిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పుగుండూరు గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్యూల్ మాట్లాడుతూ జీ–20 సదస్సు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన జన్ భాగీధారీ కార్యక్రమంలో భాగంగా ప్రతి పౌరుడికి అవగాహన కల్పించడం కోసం ఒకే భూమి–ఒకే కుటుంబం–ఒకే భవిష్యత్తు అనే నినాదంతో దేశమంతటా అవగాహన కార్యక్రమాల నిర్వహణలో భాగంగా సైకిల్ ర్యాలీ చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ శ్యామ్ సునీల్, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మా.. దీవించమ్మా..



ప్రత్యేక అలంకరణలో పోతురాజు, పోలేరమ్మతల్లి



పూజలు చేస్తున్న భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు గ్రామంలో పోలేరమ్మతల్లి జాతర వైభవంగా సాగింది. ఏరువాక పోలేరమ్మతల్లి జాతరను పురస్కరించుకుని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్ సమర్పించి మొక్కులు చెల్లించారు. ముందుగా అమ్మవారి కలశంను గ్రామంలో ఊరేగించి ఆలయంలోకి తీసుకెళ్లారు. పలువురు భక్తులు అమ్మవారికి వెండి వస్తువులు బహూకరించి 101 టెంకాయలు కొట్టి భక్తిని చాటుకున్నారు. వైఎస్సార్ సీపీ నేతల ఆధ్వర్యంలో నాలుగు, టీడీపీ ఆధ్వర్యంలో మూడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద శ్రీకృష్ణ యాదవ యూత్‌ఫోర్స్, ఆరెకాపు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. సోమవారం అమ్మవారికి కుంకుమ బండ్లు, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పొదిలి సీఐ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఎస్సై దీపిక బందోబస్తు నిర్వహించారు.

లోతైన దుక్కులతో అధిక ప్రయోజనాలు

తాళ్లూరు: లోతైన దుక్కులతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారి ప్రసాదరావు చెప్పారు. అడపాదపప కురుస్తున్న వర్షాలకు నేలను దుక్కులతో సిద్ధం చేసుకోవాలని కోరారు. నేల కోతకు గురి కావటం కూడా తగ్గుతుందని చెప్పారు. దుక్కులతో కలిగే ప్రయోజనాలు వివరించారు. రైతులు సకాలంలో దుక్కులు దున్ని పొలాన్ని సాగుకు సిద్ధం చేసుకోవాలని కోరారు.

నేడు లక్ష్మీతిరుపతమ్మ ఆలయ వార్షికోత్సవం

కురిచేడు: స్థానిక శ్రీ కోనవల్లభరాయస్వామి కొండపై వేంచేసి ఉన్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ, అంకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సోమవారం జరగనుంది. వార్షికోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివార్ల గ్రామోత్సవం చేయనున్నారు. అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

బేస్తవారిపేట: మండలంలోని జేబీకే పురంలో పేకాట శిబిరంపై ఎస్‌ఐ మాధవరావు ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.2850 నగదు స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో పేకాట, కోడిపందేలు ఆడుతున్నా, నాటుసారా తయారీ, అమ్మకాలు చేస్తున్న వారి సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

వ్యవసాయాధికారి బదిలీ

పుల్లలచెరువు: పుల్లలచెరువు వ్యవసాయాధికారి సుధీర్‌బాబు కారంచేడుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో దర్శిలో పనిచేస్తున్న ఏవోను పుల్లలచెరువు బదిలీచేశారు. ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలనాధికారిగా మరియదాసు బాధ్యతలు స్వీకరించారు. పుల్లలచెరువు ఎంపీడీవోగా కృష్ణా జిల్లాలో పనిచేస్తున్న ఈవోఆర్డీ నాగిరెడ్డికి పదోన్నతి కల్పించి పుల్లలచెరువు ఎంపీడీవోగా నియమించారు. ఆయన విధుల్లో చేరాల్సి ఉంది. పుల్లలచెరువు మండల భూసర్వే ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్‌గా మార్కాపురం ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ప్రభావతిని నియమించారు. ఆమె విధుల్లో చేరాల్సి ఉంది.

పెన్షన్‌దారులు ఈకేవైసీ వేయాలి

పెద్దదోర్నాల: ప్రభుత్వ పెన్షన్‌దారులు తప్పనిసరిగా ఈకేవైసీ వేయాలని ఏటీఓ కేవీ కెన్నడి తెలిపారు. ఆదివారం ఆయన ఈకేవైసీ గురించి మాట్లాడుతూ పెన్షన్‌దారుల ఫోన్ నంబర్‌కు ఆధార్‌తో అనుసంధానించుకోవాలని సూచించారు. అనుసంధానించిన 24 గంటల అనంతరం ఆధార్‌కార్డుతో మార్కాపురంలోని ట్రెజరీ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

విద్యుత్ సమస్యలపై హెల్ప్‌లైన్ ఏర్పాటు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే తమ దృష్టికి తీసుకురావాలని డీఈ శియానాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సిబ్బంది 24/7 పనిచేస్తారని, సమాచారం, సహాయం అవసరమైన వినియోగదారులు 73827 48829ను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా రాత్రివేళలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే సంబంధిత సబ్ స్టేషన్‌లో తెలియజేయాలని స్పష్టం చేశారు.

పుస్తకాలొచ్చేశాయ్

తర్లుపాడు: ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో అదే రోజు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా అందించనున్నారు. ఇందులో భాగంగా మండలంలోని విద్యార్థులకు అందించనున్న కిట్లు మండల కేంద్రానికి చేరుకున్నాయి. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, వర్క్‌బుక్, యూనిఫాంలు, బ్యాగ్‌లు, బెల్ట్‌ల నాణ్యతను ఎంఈఓ డి.సుజాత ఉపాధ్యాయులతో కలిసి తనిఖీ చేశారు. మండలంలోని స్కూళ్లకు విద్యా కానుక కిట్లను తరలించనున్నట్లు ఎంఈఓ తెలిపారు.